క్లుప్తంగా...

కాసు బ్రహ్మానందరెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సూర్యానాయక్, కుమారరావు

నాంపల్లి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత కాసు బ్రహ్మానంద రెడ్డి వర్ధంతి శనివారం టీపీసీసీ ఆధ్వర్యంలో గాంధీ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు కుమారరావు, ట్రైఫెడ్ చైర్మన్ మాజీ చైర్మన్, ఏఐసీసీ సభ్యులు ఎం.సూర్యా నాయక్, కాంగ్రెస్ నేత అల్లం భాస్కర్ కాసు బ్రహ్మానంద రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాసు బ్రహ్మానందరెడ్డి గొప్ప పరిపాలనాదక్షుడని కీర్తించారు.

రూ.2వేల నోట్ల రద్దు బీజేపీ కుట్ర



కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు కృష్ణ తదితరులు

గోల్కొండ: రూ.2 వేల నోట్లు ఉపసంహరించుకోవడం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కుట్ర అని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కురకుల కృష్ణ అన్నారు. శనివారం రింగ్ రోడ్డు లక్ష్మీనగర్‌లో కార్వాన్ నియోజకవర్గ ముఖ్య కాంగ్రెస్ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి ముంగి రఘుపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో రూ.500, 1000 నోట్లను రద్దు చేసిన బీజేపీ ప్రభుత్వం అందరి విమర్శలకు గురయ్యిందన్నారు. నేడు తమను వ్యతిరేకిస్తున్న పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలను అష్టకష్టాల పాలు చేయడానికి మోదీ ప్రభుత్వం రూ.2 వేల నోట్ల రద్దు చేసిందని ఆయన విమర్శించారు. చంటిబాబు, ఎ.కృష్ణ, వినోద్ సింగ్, ప్రేమ్ సింగ్, రాం కిషోర్ తదితరులున్నారు.

విద్యారంగంలో ప్రైవేటు బడ్జెట్ పాఠశాలల పాత్ర కీలకం



ఐటా నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: విద్యారంగంలో ప్రైవేటు బడ్జెట్ పాఠశాలల పాత్ర కీలకమని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్, జమియత్ ఉల్ ఉలేమా హింద్ తెలంగాణ శాఖ వారితో కలిసి అవర్ యూత్ అవర్ రెస్పాన్స్ బులిటీ అనే కార్యక్రమం నిర్వహించారు. శనివారం టోలిచౌకి టూంబ్స్ రోడ్డులోని గోల్డెన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కౌసర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. శతాబ్దాల నుంచి ప్రైవేటు బడ్జెట్ పాఠశాలలు పేద బడుగు వర్గాలకు విద్యను అందిస్తున్నాయన్నారు. ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు సయ్యద్ ఆరిఫ్, సమీవుల్లా, మహ్మద్ హిదాయత్ అలీఖాన్, సయ్యద్ షెహబాజ్ తదితరులున్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ.రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఒక కార్టూన్ ఎన్నో భావాలను పలికిస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి అన్నారు. శనివారం రవీంద్రభారతిలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యతో సత్కళాభారతి, హాస్యానందం ఆధ్వర్యంలో తెలుగు కార్టూనిస్టుల దినోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్టూన్ సమాజాన్ని ప్రభావితం చేస్తుందన్నారు. అనంతరం ప్రముఖ కార్టూనిస్టు గోపాలకృష్ణ రచించిన కార్టూన్ పుస్తకాలను, ముళ్లపూడి వెంకటరమణ రచించిన జనతా ఎక్స్‌ప్రెస్ పుస్తకాలను ఆవిష్కరించారు. అదేవిధంగా కార్టూన్ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేయడంతో పాటు వడ్డేపల్లి వెంకటేష్‌కు బాపూరమణ పురస్కారాన్ని అందజేశారు. సినీనటుడు ఎల్‌బీ.శ్రీరామ్, సాహితీవేత్త అక్కిరాజు సుందర రామకృష్ణ, యువ కళావాహిని అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ, నిర్వాహకులు రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయం



బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే కౌసర్



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న హోంమంత్రి

హోం మంత్రి మహమూద్ అలీ

గోల్కొండ: ప్రజా సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. గోల్కొండ రిసాలబజార్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను ఆయన ఎమ్మెల్యే కౌసర్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిఒక్క పథకంలో పారదర్శకత ఉంటుందన్నారు. సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలకు భారీ ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని ఆయన తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రారంభించిన బస్తీ దవాఖానాలు వేలాది మంది పేద కుటుంబాలు వైద్య సేవలు అందిస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక ల్యాబ్‌లు ఏర్పాటు చేసి అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నారన్నారు. నేడు ప్రభుత్వ ఆస్పత్రులు కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా పని చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా మందుల కొరత లేదని ఆయన అన్నారు. ముందుగా ప్రజారోగ్యంపై దృష్టిసారించిన ముఖ్యమంత్రి ఒక్కొక్కటిగా అన్ని ప్రభుత్వ శాఖలను ప్రక్షాళన చేస్తున్నారని ఆయన తెలిపారు. అత్యాధునిక టెక్నాలజీతో రాష్ట్రంలో పోలీస్‌స్టేషన్‌లను నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. మోసాలు, నేరాలకు పాల్పడుతున్న వారు రాష్ట్రం సరిహద్దులు దాటినా కూడా పోలీసులు ఆధునిక పరిజ్ఞానంతో వారిని పట్టుకుంటున్నారన్నారు. ఆధునీకరించబడ్డ పోలీస్ స్టేషన్‌లు కార్పొరేట్ కార్యాలయాలను తలపించే విధంగా ఉంటున్నాయని ఆయన అన్నారు. అనంతరం ఆయన బస్తీ దవాఖానాల్లో కలియ తిరిగారు. ఆయన స్వయంగా బస్తీ దవాఖానాలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్ ఫర్హాన్, బదరుద్దీన్, కార్వాన్ క్లస్టర్ ఎస్‌సిహెచ్‌ఓ డాక్టర్ అనురాధ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ వైపే అన్నివర్గాల ప్రజలు



సయ్యద్ ఫహీమ్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: సీఎం కేసీఆర్ ప్రభుత్వ ప్రగతి, అభివృద్ధిని చూసి అన్నివర్గాల ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఆదరిస్తున్నారని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. సీనియర్ మైనార్టీ నాయకులు సయ్యద్ ఫహీమ్‌ను గోషామహల్ నియోజకవర్గ మైనార్టీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించి ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. మైనార్టీలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉందన్నారు. మైనార్టీలతో పాటు అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే అన్ని శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేస్తామని నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు.

జన్మదిన వేడుకలు



రోహిన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కృష్ణ తదితరులు

గోల్కొండ: ప్రజలు బీజేపీ విధానాలతో విసుగెత్తి పోయారని కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా కమిటీ అధ్యక్షుడు డాక్టర్ రోహిన్‌రెడ్డి అన్నారు. శనివారం కార్వాన్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శనివారం ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కురకుల కృష్ణ, ఎం.రఘుపాల్ రెడ్డి, చంటిబాబు తదితరులున్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కళార్చన

యాకుత్‌పురా: భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కళార్చన సూచించారు. హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని శివంరోడ్డు లేబర్ అడ్డా ప్రాంతాంలో కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. 18 నుంచి 60 ఏళ్ల లోపు వారు గత 12 నెలలో 90 రోజులకు తక్కువ కాని కాలంలో భవన, ఇతర నిర్మాణ పనులలో నియమించబడినవారు అర్హులన్నారు. కార్మికులు తమ సంక్షేమ పథకాల అమలులో ఏవైన సమస్యలుంటే న్యాయ సలహాలు, సాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది మహాలక్ష్మి, పారా లీగల్ వలంటీర్లు సురేష్‌కుమార్, కజీం పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

యాకుత్‌పురా: ప్రజలు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మొఘల్‌పురా కార్పొరేటర్ నస్రీన్ సుల్తానా సూచించారు. జీహెచ్‌ఎంసీ చేపట్టిన 100 రోజుల స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా శనివారం సుల్తాన్‌షాహి ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ్ సెహర్ అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ ఇంట్లోని తడి, పొడి చెత్తను రోడ్లపై వేయకుండా ఇంటి వద్దకు వచ్చే జీహెచ్‌ఎంసీ ఆటో టిప్పర్ సిబ్బందికి అందజేయలన్నారు. నీటిని వృథా చేయకుండా, ప్లాస్టిక్ వాడకాని నిషేధించి, మొక్కలు నాటి పర్యవరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం శానిటరీ జవాన్ శేఖర్, ఎస్‌ఎఫ్ఏ సిద్దేశ్వర్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి




కమిషనర్ నీతూప్రసాద్‌ను కలిసిన డాక్టర్ ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేని తదితరులు

అబిడ్స్: వాణిజ్య పన్నుల శాఖలో ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. శనివారం వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ నీతూప్రసాద్‌ను ఆయన కలిసి ఉద్యోగుల సమస్యలను వివరించారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, పదవులు వెంటనే ఉద్యోగులకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యలు కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉండడంతో ఉద్యోగులు ఆవేదనతో ఉన్నారని ముజీబ్ హుస్సేని ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా నీతూప్రసాద్ మాట్లాడుతూ.. వెంటనే వివిధ విభాగాల్లో ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగులకు, అధికారులకు ప్రభుత్వం అండగా ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బి.శంకర్, ఈఎస్ఐ రాజ్‌కుమార్, కమర్షియల్ ట్యాక్స్ యూనిట్ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సోదరిని వేధిస్తున్న వ్యక్తికి జైలు

డబీర్‌పురా: సోదరిని అసభ్య పదజాలంతో దూషించిన కేసులో ఓ వ్యక్తికి కోర్టు 5 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. డబీర్‌పురా ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముంటున్న యువతిని సొంత సోదరుడు మీర్ జాఫర్ అలీ అబేదీ ఆలియాస్ ముస్తాక్ కొన్ని రోజులుగా అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ విషయమై యువతి డబీర్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మీర్ జాఫర్ అలీ అబేదీ ఆలియాస్ ముస్తాక్ ఈ-పెట్టి కేసు నమోదు చేసుకొని 6వ స్పెషల్ మెట్రో మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా.. నిందితునికి మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు 5 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

వాటర్‌బోర్డు సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం



వాటర్‌బోర్డు సీజీయంతో సమావేశమైన ఆనంద్‌కుమార్ గౌడ్ తదితరులు

అబిడ్స్: వాటర్‌బోర్డు సమస్యలను వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరిస్తారని వాటర్‌బోర్డు సీజీఎం ప్రభు పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్ ప్రభును కలిసి జాంబాగ్ డివిజన్‌లోని పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వాటర్ బోర్డు సీజీఎం మాట్లాడుతూ.. వాటర్‌బోర్డు సమస్యలు సంబంధిత జీఎం, డీజీఎం, మేనేజర్‌లు పర్యటించి పరిష్కారం చేస్తారని హామీ ఇచ్చారు. అనంతరం ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. వాటర్‌బోర్డు సమస్యలతో పాటు ఇతర సమస్యలు, అభివృద్ధి పనులు మంత్రి తలసాని సహకారంతో పరిష్కారం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ అహ్మద్, అక్బర్ అలీ షరీఫ్, మహ్మద్ అసద్, మహ్మద్ మాజీద్, నిజాంసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్ కూలర్ దుకాణంలో అగ్ని ప్రమాదం

దూద్‌బౌలి: హుస్సేనీఆలం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బారాగల్లీ ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. హుస్సేనీఆలం పోలీసుల వివరాల ప్రకారం.. బారాగల్లీ ప్రాంతంలో ఎయిర్ కూలర్ దుకాణంలో ముందుగా అగ్ని ప్రమాదం సంభవించి పక్కనే ఆటో మొబైల్ షాపుకు మంటలు వ్యాపించడంతో షాపులో ఉన్న నాలుగు వాహనాలతో పాటు కూలర్ షాపులోని అన్ని కూలర్లు అగ్నికి దగ్ధమయ్యాయి. పోలీసులు, స్థానికులతో కలిసి అక్కడ దుకాణాలపైన ఉన్న వారిని సురక్షితంగా రక్షించారు. గాయపడిన ఇద్దరిని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. ఈ ఘటనలో ఆటో పార్ట్స్ దుకాణం యజమాని నసీర్ మాట్లాడుతూ... ఈ ఘటనలో దాదాపు రూ.25 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు. కార్పొరేటర్ సోహేల్ ఖాద్రీ బాధితులను పరామర్శించి ఈ విషయాన్ని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ దృష్టికి తీసుకెళ్తానన్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

రేపు రవీంద్రభారతిలో భాగ్యరెడ్డి వర్మ జయంత్యుత్సవాలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆది హిందూ సోషల్ సర్వీస్‌లీగ్ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: భాగ్యరెడ్డివర్మ 135వ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్ కార్యదర్శి మాదిరి అజయ్ గౌతమ్ తెలిపారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 22న సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతిలో భాగ్యరెడ్డివర్మ జయంత్యుత్సవాల షెడ్యుల్ కులాల అభివృద్ధి శాఖ, భాషా సాంస్కృతిక శాఖ, ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ప్రత్యేక అతిథిగా నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి విశిష్ట అతిథులు ఎమ్మెల్సీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, తెలంగాణ శాసనసభ సభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి, సభాధ్యక్షులుగా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, గౌరవ అతిథులుగా క్రీడలు యువజన సేవల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, హోం మంత్రి మహమూద్ అలీ, పశు సంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ ఎంఎస్. ప్రభాకర్‌రావు, ప్రభుత్వ సలహాదారు కేవీ.రమణాచారి, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, దానం నాగేందర్, తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు జులూరి గౌరీ శంకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయరెడ్డి, గంటా చక్రపాణి, సుధారాణి, రాహుల్ బొజ్జ హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్లు రాహుల్ ఆమోల్లం శాస్త్రి, డి. బాల నరసింహ, సహాయ కార్యదిర్శి శ్రీలత గౌతమ్, ఉపాధ్యక్షుడు పి.బాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలి



వినతి పత్రం అందజేస్తున్న మహిళా సమైక్య ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: మహిళా మల్లయోధులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బాక్సింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య డిమాండ్ చేసింది. శనివారం మహిళా సమైక్య ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన సంతకాల సేకరణలో భాగంగా నగర శాఖ సేకరించిన వివరాలను హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నగర కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి ఎస్.ఛాయాదేవి మాట్లాడుతూ.. ఒలింపిక్స్‌లో భారతదేశ కీర్తిని ఇనుమడింప చేసిన మల్లయోధులను ఈ విధంగా అవమానించడం ఎంతో బాధాకరమన్నారు. తక్షణమే మల్లయోధుల ఫెడరేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ భూషణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా గౌరవ అధ్యక్షురాలు ప్రేమపావని, అధ్యక్షురాలు పడాల నలిని, ఉపాధ్యక్షురాలు షహనా తదితరులు పాల్గొన్నారు.

సత్కారం



గౌలిపురా: డీఎల్‌ఆర్‌ఎల్‌లో 18-35 ఏళ్లగా పని చేస్తున్న క్యాజువల్ వర్కర్లకు ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటి వరకు పర్మినెంట్ చేయడం లేదని క్యాజువల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అన్నారు. ఇన్ని సంవత్సరాలుగా పని చేస్తున్న తమకు నెల జీతం తప్పా.. పీఎఫ్, ఈఎస్ఐ వంటి ఎలాంటి బెనిఫిట్‌లు అందడం లేదన్నారు. ఈ సందర్భంగా సెంట్రల్ లేబర్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లడం జరిగిందన్నారు. గత కొన్ని రోజులుగా పెండింగ్ ఉన్న ఏరియస్ రావడంతో శనివారం డీఎల్‌ఆర్‌ఎల్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ తరపున జనరల్ సెక్రటరీ పి.ఎం.గోపాల్‌ను కలిసి శాలువాతో సత్కరించడం జరిగిందన్నారు.

బండా ప్రకాశ్‌కు సన్మానం



చార్మినార్: పాతబస్తీలో శనివారం జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ప్రభుత్వ విప్ బండ ప్రకాశ్‌ను పాతబస్తీ బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా సత్కరించారు. బీఆర్‌ఎస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీతో పాటు మొఘల్‌పురా డివిజన్ అధ్యక్షులు పుప్పాల రాధాకృష్ణ తదితరులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు.

ఉచిత యోగా శిక్షణ



యోగా శిక్షణలో పాల్గొన్న సీనియర్ శిక్షకులు నరేందర్ సింగ్ వాలియా

అబిడ్స్: ప్రజలు ఆరోగ్యకర జీవితం పొందేందుకే భారతీయ యోగ్ సంస్థాన్ (బీవైఎస్) నిరంతరం ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తుందని బీవైఎస్ సీనియర్ శిక్షకులు నరేందర్ సింగ్ వాలియా పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడం, వారు జీవితాంతం ఆరోగ్యంతో ఉండాలని భారతీయ యోగ్ సంస్థాన్ ప్రతిరోజూ ఉచితంగా యోగా శిక్షణ తరగతులు చేపడుతుందన్నారు. బీవైఎస్ ఆధ్వర్యంలో రెండవ రోజు శనివారం యోగా సభ్యులకు ఆరోగ్యం పట్ల పలు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా నరేందర్ సింగ్ వాలియా మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో అన్ని బస్తీలు, కాలనీలు, అన్ని ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ యోగాపట్ల అవగాహన కల్పించడం తమ ప్రధాన ఉద్దేశమన్నారు. తరచూ బీవైఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి పలు ఆరోగ్య అంశాలపై ప్రజలకు ఉచితంగా అవగాహన తరగతులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ యోగ్ సంస్థాన్ శిక్షకులు సత్యనారాయణ, లత తదితరులు పాల్గొన్నారు.